## బాధితులకు పరామర్శ

బాధితురాలిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కాప్రా, ఆగస్టు 26: ఏఎస్‌రావునగర్ డివిజన్ జైజవాన్‌కాలనీ దేవీనగర్‌లో రెండంతస్తుల ఇంటి లోని ఓ ఫ్లోర్ పాక్షికంగా దగ్ధం కావడంతో సదరు కుటుంబానికి చెందిన బాధితులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శించారు. రైల్వేలో పనిచేసే మాధురి, ఆమె కుమారుడు శైలేష్ ఆ ఇంటిలో నివసిస్తున్నారు. ఘటన జరిగిన సమయంలో వారెవ్వరూ ఇంటిలో లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందని ఎమ్మెల్యేకు వారు తెలిపారు. రూ.10లక్షల నుంచి 15లక్షల వరకు నష్టం వాటిల్లిందని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్తరామారావు, నాయకులు మహిపాల్‌రెడ్డి, రహీం తదితరులు పాల్గొన్నారు

## ఇద్దరు అదృశ్యం

నవీన్(ఫైల్)

మల్కాజిగిరి, ఆగస్టు 26:వ్యక్తి అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం.. ఐఎన్ నగర్‌కు చెందిన నవీన్(29) ప్రైవేటు ఉద్యోగిగా పని చేస్తుంటాడు. 21న ఉదయం ఇంటి నుంచి ఉద్యోగానికి వెళ్లి తిరిగి రాలేదు. తండ్రి దావిద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### సూపర్ మార్కెట్‌కు వెళ్లి..

మోహన్‌కృష్ణ

శామీర్‌పేట : సూపర్ మార్కెట్‌కు వెళ్లి వస్తానని కొంపల్లికి వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. పోలీసుల కథ నం ప్రకారం వివరాలు.. తూం కుంటలో నివాసం ఉంటున్న మోహన్ కృష్ణ(20) మోర్ సూపర్‌మార్కెట్‌లో పని చేస్తున్నాడు. 21న ఒంటి గంట ప్రాంతంలో కొంపల్లిలోని విజేత సూపర్ మార్కెట్‌లో పని ఉందని చెప్పి వెళ్లాడు. సాయంత్రమైన తిరిగి ఇంటికి రాలేదు. పరిసర ప్రాంతాలు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో సోమవారం శామీర్‌పేట పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## గ్రీన్ సైనిక్‌పురి సేవలు అభినందనీయం

సమావేశంలో మాట్లాడుతున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా, ఆగస్టు 26–కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి 'గ్రీన్ సైనిక్‌పురి' ఆధ్వర్యంలో చేస్తున్న సేవలు అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కాప్రా సైనిక్‌పురి హెచ్ఎంటీనగర్ బేరింగ్స్ కాలనీ కమ్యూనిటీహాలులో గ్రీన్ సైనిక్‌పురి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైనిక్‌పురి ప్రాంత కాలనీల ప్రతినిధుల సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్‌సైనిక్‌పురి ఆధ్వర్యంలో సామాజిక కార్యక్రమాలను మున్ముందు కొనసాగించాలని, వారి కార్యక్రమాలకు తన మద్దతు ఉంటుందని అన్నారు. తన దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రీన్ సైనిక్‌పురి ప్రతినిధులు మాట్లాడుతూ మెట్రో రైలు ఈసీఐఎల్ చౌరస్తావరకు పొడిగించాలని, శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లేందుకు సైనిక్‌పురి ప్రాంతం నుంచి నేరుగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమానికి కార్పొరేటర్ స్వర్ణరాజు, గ్రీన్ సైనిక్‌పురి నిర్వాహకులు చంద్రశేఖర్, బీజేపీ నాయకులు వినోద్, బీఆర్ఎస్ నాయకులు,సైనిక్‌పురి ప్రాంత కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న కమిటీ సభ్యులు

## ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

మల్కాజిగిరి, ఆగస్టు 26: ఆలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయం శ్రీసాయినగర్ కాలనీలో శ్రీ రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొనాలని కమిటీ సభ్యులు సోమవారం ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ నియోజక వర్గంలోని అన్ని దేవాలయాల్లో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని దేవాలయాల్లో ఇప్పటికే సౌకర్యాలు కల్పించామని అన్నారు. బోనాల పండుగను వైభవంగా నిర్వహించామని, దాదాపు అన్ని దేవాలయాలకు ఆర్థిక సహాయాన్ని అందజేశామన్నారు. వినాయక చవితి పండుగ కోసం ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం ఏర్పాట్లు చేశామని, సఫిల్‌గూడ మినీ ట్యాంక్ బండ్‌పైన అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని అన్నారు. కమిటీ సభ్యులు రాజేశ్‌ముదిరాజ్, అశోక్‌కుమార్, అరవింద్, సాయి పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

మేడ్చల్, ఆగస్టు 26 : మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డుకు చెందిన నరేశ్‌కు సీఎం సహాయ నిధి నుంచి రూ.12వేల ఆర్థిక సాయం మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కును సోమవారం ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మద్దుల శ్రీనివాస్ రెడ్డి, మండల రవికుమార్, బీఆర్ఎస్ 2వ వార్డు అధ్యక్షుడు మండలి ఈశ్వరయ్య పాల్గొన్నారు.

## మట్టి గణపతులనే పూజించాలి

గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న కుషాయిగూడ ఏసీపీ మహేశ్

మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 26 : భక్తి శ్రద్ధలతో వినాయక ఉత్సవాలను నిర్వహించుకోవాలని కుషాయిగూడ ఏసీపీ మహేశ్ సూచించారు. గణేశ్ ఉత్సవాలపై నాగారం మున్సిపాలిటీలో సోమవారం ఉత్సవ కమిటీ సభ్యులతో కీసర సీఐ వెంకటయ్య ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ 120 ఏండ్లుగా గణేశ్ ఉత్సవాలు మనదేశంలో జరుగుతున్నాయని, అట్టి గణపతి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించుకోవాలని సూచించారు. చెరువు వద్దకు గణేశ్ నిమజ్జనం కోసం వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, లైటింగ్ ఏర్పాటు చేయాలని, చెరువు వద్ద పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను ప్రతిష్ఠించి పూజించాలని, మట్టి గణపతులను నెలకొల్పి పూజించిన వారికి ముగ్గురిని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సన్మానిస్తామని అన్నారు. నాగారం జీపీ కాలనీలో మట్టి గణపతిని ప్రతిష్ఠించి పూజలు చేసి అక్కడే నిమజ్జనం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగారం మున్సిపాలిటీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, సీఐ వెంకటయ్య, ఎస్ఐలు నాగరాజు, వెంకటేశ్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జవహర్‌నగర్ డంపింగ్ యార్డును ఎత్తివేయాలి

ధర్నా చేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 26 :జవహర్ నగర్ చెత్త డంపింగ్ యార్డును ఎత్తివేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొత్తగా వెల్లడించిన డంపింగ్ యార్డు విస్తరణ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ దమ్మాయిగూడ మున్సిపాలిటీ హరిదాస్‌పల్లిలో స్థానికులతో కలసి రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో, ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేసిన సందర్భంలో నేటి సీఎం రేవంత్ రెడ్డి గ్రేటర్ హైదరాబాద్ నుంచి వస్తున్న చెత్తను ఎక్కడికక్కడ డిస్పోస్ చేసే విధంగా చర్యలు తీసుకొని డంపింగ్ యార్డును ఇక్కడి నుంచి తరలిస్తానని హామీ ఇచ్చారని అన్నారు. హామీలను పక్కన బెట్టి డంపింగ్ యార్డును మరింత విస్తరించేందకు రాంకీ సంస్థతో ఒప్పందం చేసుకున్నారని విమర్శించారు. రైతులకు అరకొర రుణమాఫీ చేసి రాష్ట్రంలో ప్రజల దృష్టిని మరల్చేందుకు హైడ్రా పేరుతో చెరువుల పరిరక్షణ అంటూ మరోవైపు గుండ్ల చెరువును రాంకీ సంస్థకు దారా దత్తం చేయడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. డంపింగ్ యార్డును ఎత్తివేయాలని పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు మాధవరెడ్డి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

## కీసరగుట్టలో ఘనంగా పూజలు

కీసర, ఆగస్టు 26: కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామివారికి భక్తులు ఘనంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సోమవారం శివుడికి ఇష్టమైన రోజు కావడంతో శివభక్తులు అధిక సంఖ్యలో కీసరగుట్టకు విచ్చేసి స్వామివారిని దర్శించుకుంటారు. గర్భాలయంలో శ్రీ మూలవిరాట్‌స్వామివారికి తేను, ఆవుపాలు, పంచామృతంతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని వేదపండితులు ఘనంగా నిర్వహించారు.

## నిధులు కేటాయించాలి

ఘట్‌కేసర్,ఆగస్టు26: ఘట్‌కేసర్‌లో గుంతల మయమైన రోడ్డు మరమ్మతు పనులకు ప్రభుత్వ ఆధ్వర్యంలో నిధులు కేటాయించాలని ఘట్‌కేసర్ చైర్‌పర్సన్ పావని నియోజక వర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి తోటకూర జంగయ్య యాదవ్ ను కోరారు. సోమవారం మున్సిపాలిటీ నాయకులతో కలిసి ఆయన నివాసంలో ఆమె వినతి పత్రం అందజేశారు. ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ పనుల కారణంగా ఫ్లైఓవర్‌కు అటు వైపు ఉన్న కొండాపూర్, బాలాజీ నగర్, కొండాపూర్,వీకర్ సెక్షన్ కాలనీ,గాంధీనగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాలను రోడ్డు మళ్లించి నారాయణ గార్డెన్ రోడ్డు ద్వారా వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ రోడ్డు పూర్తిగా గుంతలు పడి వాహనాలు తిరగలేని పరిస్థితి నెలకొందన్నారు.ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు కేటాయించే విధంగా జంగయ్య యాదవ్ కృషి చేయాలని కోరారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ముత్యాలు యాదవ్ నాయకులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి

మేడ్చల్, ఆగస్టు 26 : శ్రీకృష్ణ జన్మాష్టమిని మేడ్చల్‌లోని శ్రీగార్డెన్స్‌లో హరేకృష్ణ సేవా సమాజ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 4.30 గంటలకు ఉట్టికొట్టే కార్యక్రమంతో వేడుకలను ప్రారంభించారు.

## ఆత్మరక్షణకు తైక్వాండో నేర్చుకోవాలి

పతకాలు సాధించిన జవహర్‌నగర్ విద్యార్థులు

జవహర్‌నగర్, ఆగస్టు 26: ఆత్మరక్షణ కోసం చిన్నప్పటి నుంచే విద్యార్థులు తైక్వాండో నేర్చుకోవాలని మాస్టర్ నరేందర్ యాదవ్ అన్నారు. ఫస్ట్ ఓపెన్ తెలంగాణ తైక్వాండో చాంపియన్‌షిప్ క్రీడా పోటీలు సోమవారం ఘట్‌కేసర్ పరిధిలోని ఎదులాబాద్‌లో నిర్వహించారు. మా స్టర్ కానుగంటి నరేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో జవహర్‌నగర్‌కు చెందిన విద్యార్థులు తైక్వాండో పోటీల్లో పాల్గొని బంగారు, వెండి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా నరేందర్‌యాదవ్ మాట్లాడుతూ మార్షల్ నేర్చుకోవడంతో శారీరక దృఢత్వం పెంపొందుతుందన్నారు. గోల్డ్ మెడల్స్‌లో నిత్య మహాలక్ష్మి, రేవంత్‌గౌడ్, ప్రవీణ్, బాలశివప్రసాద్, సిల్వర్ మెడల్స్‌లో నైనా, సాక్షి, ఐశ్వర్య, యెజిత్, వీరబ్రహ్మస్వామి, సాయిజేతు, మహేశ్, కార్తికేయ, శివకుమార్, ప్రమోద్ పతకాలు సాధించారు.

## యువత క్రీడలపై దృష్టి పెట్టాలి

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏసీపీ రాములు, సీఐ శ్రీనాథ్

శామీర్‌పేట, ఆగస్టు 26 : యువత చెడు అలవాట్ల వైపు చూడకుండా క్రీడలపై దృష్టి సారించాలని పేట్‌బషీర్‌బాగ్ ఏసీపీ రాములు అన్నారు. సైబరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో శామీర్‌పేట మండలం మజీద్‌పూర్‌లో జైన్ హెరిటేజ్ స్కూల్‌లో సోమవారం కమ్యూనిటీ పోలీసింగ్ వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ యువశక్తిని ఉత్తేజ పరిచి సమాజానికి ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దడం కోసమే కమ్యూనిటీ పోలీసింగ్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగిందన్నారు. క్రీడలతో మానసిక ప్రశాంతత, శారీరక దారుఢ్యంతో పాటు క్రీడాకారుల మధ్య సేహ్నబంధం పెంపొందుతుందన్నారు. ఈ టోర్నమెంట్‌లో శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 17 గ్రామాల నుంచి టీమ్స్, 1 పోలీస్ టీమ్ పాల్గొనడం జరిగిందన్నారు. విజేతలుగా నిలిచిన ప్రథమ స్థానం పోలీస్ టీమ్, ద్వితీయ జగ్గంగూడ, తృతీయ స్థానాల్లో తూంకుంట టీమ్స్ నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఐ గంగాధర్, ఎస్ఐలు పరశురాం, మునీందర్, హారిక, మాజీ జడ్పీటీసీ బాలేశ్, మాజీ ఎంపీటీసీ నాగరాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సరసం మోహన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వైఎస్ గౌడ్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

పీర్జాదిగూడ, ఆగస్టు 26: ఇంజినీరింగ్ విద్యతో పాటు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అరోరా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీలత చేవూరి అన్నారు. సోమవారం పర్వతాపూర్‌లోని అరోరా డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో ఏఐ సీటీ ఈ సహకారంతో ఆరు రోజులు పాటు నిర్వహించే సాంకేతికతను పెంపొందించడం..అభివృద్ధిని నడిపించడం అనే శీర్షిక పై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంకు ఆమె హాజరై ప్రారంభించారు. డీన్ డాక్టర్ ఆర్.హఫీజ్‌భాషా, ప్రొఫెసర్ వెంకటరమణయ పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ కృష్ణ జన్మాష్టమి

బాలాజీనగర్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న మేయర్ శాంతి, శ్రీకాంత్‌యాదవ్

బీజేఆర్ కాలనీలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

జవహర్‌నగర్, ఆగస్టు 26: మానవుడి జీవితంలో శ్రీకృష్ణ భగవానుడు కొలువై ఉంటాడని, సహనంతో సాధించలేనిది ఏమి లేదని, ప్రజలు శ్రీకృష్ణుడిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని మేయర్ శాంతి అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ బాలాజీనగర్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని శ్రీ మల్లన్న యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం వేడుకలను నిర్వహించారు. కార్పొరేటర్లు మేక లలితాయాదవ్, గొడుగు వేణు, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, యాదగిరియాదవ్, వినయ్, మిట్టు యాదవ్, యాదవసంఘం అధ్యక్షుడు అశోక్‌యాదవ్, ఉపాధ్యక్షుడు రామకృష్ణ యాదవ్, జనరల్ సెక్రటరీ కృష్ణయాదవ్, సభ్యులు శ్యామ్‌యాదవ్, రాజుయాదవ్, మల్లేష్‌యాదవ్, రమేష్‌యాదవ్, ఐలయ్యాదవ్, నర్సింహయాదవ్ పాల్గొన్నారు.

కాప్రా: కృష్ణాష్టమినికాప్రా, ఏఎస్‌రావు నగర్ డివిజన్లలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ కొత్తరామారావు, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి: కృష్ణాష్టమిని అంగరంగవైభవంగా నిర్వహించారు. సోమవారం మల్కాజిగిరి, అల్వాల్ డివిజన్‌లలో కృష్ణాష్టమి సందర్భంగా దేవాలయాలో భక్తులు పూజలు నిర్వహించారు. అవిజ్ఞ, శివాన్స్, శేయాన్స్, సురేశ్, రాజేశ్‌కన్న పాల్గొన్నారు.

కీసర: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా కీసర ప్రధాన చౌరస్తాలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులకు యాదవ సంఘం యువత నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. చీర్యాల్‌లోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో జన్మాష్టమి వేడుకలను నిర్వహించారు. వివిధ రకాల ప్రసాదాలు,పూలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారికి ఊయ్యాల సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ గౌడ్, ఆలయ ధర్మకర్త శ్రీహరిగౌడ్‌లతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

మేడ్చల్ కలెక్టరేట్: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలలో సోమవారం శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.నాగారం సెరినిటి పాఠశాలలో విద్యార్థులు రాధా కృష్ణుల వేషధారణలతో ఆట పాటలతో అలరించారు. నాగారం, రాంపల్లి, దమ్మాయిగూడ, అహ్మద్‌గూడ, రాజీవ్‌గృహకల్ప, కుందన్‌పల్లిలలో ఆలయాల్లో జన్మాష్టమి వేడుకలనునిర్వహించారు.

రాధాకృష్ణ వేషధారణలో చిన్నారులు అవిజ్ఞ, శివాన్స్, శ్రేయాన్స్

గోపిక వేషధారణలో చిన్నారి విధాత్రి

రాధమ్మ వేషధారణలో చిన్నారి శ్రీకృతి

బాల కృష్ణుడి వేషధారణలో ..



చీర్యాల్ శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో జన్మాష్టమి వేడుకలు

రాధా కృష్ణుల వేషధారణలో నాగారం సెరినిటి విద్యార్థులతో ఉపాధ్యాయులు

## అలరించిన కూచిపూడి నృత్యం

రామంతాపూర్,ఆగస్టు 26 : ఉప్పల్ మినీ శిల్పారామంలోసోమవారం కూచిపూడి కృష్ణలీల నృత్యం అలరించింది. కుమారి భాగవతుల శివానీ శిష్య బృందం తో బ్రహ్మాంజలి,వినాయక కౌతం,మహాగణపతిం,తాండవనృత్యం,నారాయణీయం,శృంగారలహరి,ముద్దుగారె యశోద,మండూక శబ్దం,హిందోళం,తిల్లాన తదితర కీర్తనలు ఆహుతులను ఎంతో అలరించాయి. తన్వి,ధృతి, సమన్విత, శ్రీనిక, నిత్య, శ్రీవిద్య, వినూత్న, అభిజ్ఞ, నైనా పాల్గొన్నారు.

## జాతీయ అంతరిక్ష దినోత్సవం

విద్యార్థులకు మెమోంటోలు అందజేస్తున్న శాస్త్రవేత్త కృష్ణయ్య

రామంతాపూర్,ఆగస్టు 26 : ఉప్పల్ సర్వే ఆఫ్ ఇండియాలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఉప్పల్‌లోని జ్యోషి విద్యానికేతన్ విద్యాసంస్థల విద్యార్థులు సిద్ధాంత్, రియా, వికాస్, గౌతం, సాత్విక్‌లు ప్రతిభ కనబర్చి మొదటి ర్యాంక్ సాధించారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజన్సీ సైంటిస్టు కృష్ణయ్య,సర్వే ఆఫ్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ వైకే రాథోడ్ విద్యార్థులకు మెమోంటోలు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ జగదీశ్ జ్యోషి పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శామీర్‌పేట, ఆగస్టు 26 : పూడూరు గ్రామానికి మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం విధించనున్నట్టు పట్టణ ఏఈ శశిధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు 11కేవీ మల్లన్న ఫీడర్ పరిధిలో, పూడూరు ఫీడర్ పరిధిలోని మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

శామీర్‌పేట : విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అలియాబాద్ ఏఈ శ్రీనివాస్‌గౌడ్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. 33–11కేవీ లక్ష్మాపూర్ సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ నారాయణపూర్ ఫీడర్‌లో మరమ్మతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. దీంతో మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నారాయణపూర్ గ్రామం, వ్యవసాయ క్షేత్రాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని గుర్తించి ప్రజలు, వినియోగదారులు సహకరించాలని కోరారు.